క్లుప్తంగా

ముదునూరికి అభినందనలు


ముదునూరికి అభినందనలు తెలుపుతున్న నాయకులు

మొగల్తూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజును మాజీ ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, నేతల రమేష్ అభినందించారు. శుక్రవారం నరసాపురంలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో చేపట్టబోయే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని భవిషత్ అంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు వాయిదా

నరసాపురం: నరసాపురంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన సీపీఎం రాష్ట్ర మహాసభలు వాయిదా పడినట్టు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ జాతీయప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌ల మృతి కారణంగా మహాసభలు వాయిదా వేశారని పేర్కొన్నారు. తిరిగి సభలను ఎప్పుడు నిర్వహించేది తెలుపుతామని వివరించారు.

వరద బాధితులకు సాయం



వరద బాధితులకు విరాళాన్ని అందిస్తున్న ఆచంట నియోజకవర్గ అపుస్మా నాయకులు

పెనుగొండ: విజయవాడ వరద బాధితులకు ఆచంట నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్(అపుస్మా) రూ.3,50,000 విరాళాన్ని జిల్లా కలెక్టరు సి.నాగరాణికి అందించారు. శుక్రవారం భీమవరంలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో డీడీ అందించినట్లు సంఘ నాయకులు తెలిపారు. విద్యార్థులు, మేనేజ్‌మెంట్‌ల నుంచి సేకరించిన విరాళం మొత్తం డీడీ రూపంలో అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో జి.రవికుమార్, కార్యదర్శి కె.రవికుమార్, కోశాధికారి ఎం.రమేష్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి.వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

పెనుగొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యూపీఎస్ విధానం ఎంతమాత్రం ఆమోద యోగ్యం కాదని, పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. కొఠాలపర్రులో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జీఓ 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పి.జనార్దన్ స్వామి, పీవీ రాఘవులు పాల్గొన్నారు.

వీఆర్వో బళ్ల రాజు మృతి


బళ్ల రాజు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో వీఆర్వోగా పనిచేస్తున్న బళ్ల రాజు (55) శుక్రవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రాజు స్వస్థలం పోడూరు మండలం జిన్నూరు శివారు జిన్నూరుపాలెం. రాజు గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం ఉదయం జిన్నూరుపాలెంలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. రాజు మృతిపై దిగమర్రు గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశ రావు సంతాపం వ్యక్తం చేశారు.

వంద రోజుల్లో చేసింది శూన్యమే

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావచ్చింది. పాలకొల్లు మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గం కావడంతో ఎంతో అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ వంద రోజుల్లో ఏమి చేశారయ్యా అంటే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా సమీక్షలతోనే సరిపెట్టారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల్లో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ఎన్నో హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి గురించి కనీసం మాట కూడా మాట్లాడడం లేదని పార్టీ కేడర్‌తో పాటు ప్రజలు కూడా వాపోతున్నారు.

మంత్రి రామానాయుడు ఇచ్చిన హామీలివే..

నీకు రూ. 15 వేలు, నీకు రూ.15 వేలు

నీకు 15 వేలు, నీకు 15 వేలు, నీకు 18 వేలు, నీకు 15 వేలు ఇదిగో ఈ చిన్నారికి కూడా 15 వేలు వస్తుంది అంటూ యలమంచిలి మండలం ప్రచారంలో పిల్లల వద్ద వివరించారు. కూటమి ప్రభుత్వం వస్తే ఇలా ఒక కుటుంబంలో మహిళలు, విద్యార్థులు ఎంతమంది ఉంటే అంతమందికి ఈ రకంగా అందజేస్తామంటూ ఊదరగొట్టిన మంత్రి నిమ్మల నేడు కనీసం ఆ హామీల గురించి మాట్లాడే సాహసం చేయడం లేదు.

టిడ్కో గృహాలు (ఏప్రిల్ 5, 2024)

మూడో సారి నన్ను ఆశీర్వదించి గెలిపించమనేది నాకోసం, నా కుటుంబం కోసం, నా ఆస్తులు, అంతస్తులు పెంచుకోవడానికి కాదు పాలకొల్లును రాష్ట్రంలోనే అభివృద్ధి పథంలో నిలపడానికేనని చంద్రబాబు పట్టణానికి ప్రచార యాత్రలో అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 శాతం పనులు పూర్తయిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు శ్రావణమాసంలో ఏవిధమైన రుణాల భారం లేకుండా గృహప్రవేశాలు చేయిస్తానని హామీ ఇచ్చారు. శ్రావణం వెళ్లిపోయింది. బాద్రపద మాసం సగం రోజులు గడిచిపోయినా ఇళ్లు ఎప్పుడిస్తారు మంత్రి గారూ..? అంటూ లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ (ఏప్రిల్ 9, 2024)

నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో యలమంచిలి మండలం మేడపాడు గ్రామంలో నిమ్మల రామానాయుడు మరో 50 రోజుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. బీసీలకు 50 ఏళ్ల వయస్సు వారికే పింఛన్ రూ. 4 వేలు ఇంటింటికి వచ్చి అందిస్తామని చెప్పారు. ఇప్పుడు కనీసం కొత్త పింఛన్ కోసం దరఖాస్తులను తీసుకునే పరిస్థితి కూడా లేదని ప్రజలు వాపోతున్నారు.

కనకాయలంక వంతెన నిర్మాణం (మే 4, 2024)

ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కనకాయలంక వాసులకు ఫ్లైఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తానని యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నారు. మరి ఎప్పుడు శంకుస్థాపన చేస్తారు, ఎప్పుడు నిర్మాణం చేస్తారు, ఎప్పుడు ప్రారంభం చేస్తారనే విషయాలపై ఇంతవరకూ మంత్రి గారు మాట్లాడడం లేదు.

వాసవిమాత ఆలయం నిర్మాణానికి రూ.కోటి (ఏప్రిల్ 29, 2024)

పంచారామక్షేత్రం పాలకొల్లులో వాసవీమాత ఆలయ నిర్మాణం కోసం రూ.కోటి రూపాయలు తీసుకువస్తానని పాలకొల్లు పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మాట్లాడుతూ హామి ఇచ్చారు. ఆలయ నిర్మాణంలో మొదటి విడత సొమ్ము సరిపోకపోతే రెండో విడతగా మరికొంత తీసుకువస్తానని హామీ ఇచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయగానే పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి స్థల దాత యిమ్మిడి సత్యనారాయణ పేరు పెడతామని హామీ ఇచ్చారు. ఇంతవరకూ ఈ రెండింటిపై స్పందనే లేదు.

వలంటీర్లకు రూ. 10 వేలు (ఏప్రిల్ 23, 2024)

వలంటీర్లు ఎవ్వరూ రాజీనామాలు చేయవద్దు. కూటమి ప్రభుత్వం అధికారంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగించడంతో పాటు వారికి రూ. 10 వేలు వేతనం ఇస్తారని పోడూరు మండలం పెనుమదం గ్రామంలో ప్రచారంలో హామి ఇచ్చారు. బీటెక్, ఎంటెక్, డిగ్రీలు చదివిన యువత వైకాపా మాయమాటల్లో పడి రాజీనామాలు చేసి కష్టాలు తెచ్చుకోవద్దని పోడూరు మండలం పెనుమదం గ్రామంలో హామి ఇచ్చారు. ఇంతవరకూ వలంటీర్లపై ఏవిధమైన ప్రకటన లేదు వారికి జీతాలు పెంచలేదు పాత జీతాలు కూడా ఇవ్వలేదు.

మెడికల్ కళాశాల వైపు కన్నెత్తి చూడని మంత్రి

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో దగ్గులూరు మెడికల్ కళాశాల ప్రాంతానికి వెళ్లి ఇక్కడ పనులు జరగడంలేదని రాద్ధాంతం చేసి ప్రచారం చేసుకున్నారు. నేడు అధికారంలోకి వచ్చి 100 రోజులైనా ఒక్కరోజు కూడా మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి వెళ్లకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని పట్టణవాసులు చెబుతున్నారు. పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ కళాక్షేత్రం, రామగుండం పార్కు, అబ్దుల్ కలాం పార్కు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 95 శాతం పూర్తిచేసిన ప్రభుత్వ ఆసుపత్రి పనులను మాత్రం ఇప్పటికి నాలుగైదు సార్లు పర్యవేక్షణ చేశారు. కానీ మెడికల్ కళాశాల వైపు మాత్రం కన్నెత్తి చూడలేదు.



కూటమి ప్రభుత్వం రాగానే ఉచిత ఇసుక అంటూ పాలకొల్లు సభలో చంద్రబాబు హామీపై ప్రచురితమైన వార్త



బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ హామీనిస్తూ ప్రచురితమైన వార్త

హామీల అమలు ఎప్పుడు?


కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: సూపర్ 6 పథకాలతో ప్రజలను బురిడి కొట్టించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 100 రోజుల పాలనలో ప్రజలకు ఏ విధమైన సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోయారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి 100 రోజుల పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం తప్ప ప్రజలకు ఏ విధంగానూ ప్రయోజనం చేకూర్చలేకపోయారని దుయ్యబట్టారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చేశారని మండిపడ్డారు.

రైతులకు వ్యవసాయ కిట్ల పంపిణీ


అరట్లకట్టలో రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ప్రకృతి సేద్యం ద్వారా లభించే ఆహార ఉత్పత్తులతో మంచి ఆరోగ్యం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారి వై.నూకరాజు అన్నారు. పాలకొల్లు మండలం అరట్లకట్ట సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. పురుగుమందులు వాడకుండా స్థానికంగా లభ్యమయ్యే వివిధ రకాల ఆకులు, పదార్థాలతో కషాయాలు తయారు చేసుకుని పంటలకు వినియోగించవచ్చన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, డివిజన్ ఇన్‌చార్జ్ అప్పారావు, మోడల్ టీం లీడర్ మురళీకృష్ణ, ఎంటీ నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొగల్తూరులో మొక్కలు నాటుతున్న వార్డు సభ్యులు


వడలిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

మొగల్తూరు: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొగల్తూరు మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఆయా గ్రామ సర్పంచ్‌లు మొక్కలు నాటారు. మొగల్తూరులో సర్పంచ్ పడవల మేరీ, స్థానిక నాగదేవత గుడి ప్రాంతంలోని చెరువు గట్టు వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగానే తల్లి పేరుతో ఒక మొక్కను ప్రజాప్రతినిధులు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ వడలికి సహకరించాలి

పెనుగొండ: వడలి గ్రామాన్ని స్వచ్ఛ వడలిగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ-2024లో భాగంగా శుక్రవారం వడలిలో మొక్కలు నాటారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టామన్నారు. మొక్కలు నాటిన అనంతరం అందరూ స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలపన నరేష్, పంచాయతీ సభ్యుడు మేకా శివయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కోసం బాధ్యత వహించాలి

పాలకొల్లు సెంట్రల్: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే పట్టణమంతా సుందరీకరణంగా తీర్చిదిద్దవచ్చని మునిసిపల్ కమిషనర్ విజయసారధి అన్నారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారధి మాట్లాడుతూ ప్రతి రోజూ మన నిత్య జీవితంలో కొంత సమయం పరిసరాలు పరిశుభ్రతకు కేటాయిస్తే మంచి పర్యావరణం కలిగిన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవి శంకర్, జ్యోత్స్న రాణి, శ్రీ సంధ్య, భాగ్యలక్ష్మి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సిద్ధాంతం శ్మశానవాటిక


సిద్ధాంతం శ్మశాన వాటికలో పెరిగిన తుప్పలను చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరుగాంచిన సిద్ధాంతం శ్మశానవాటిక పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని సీపీఎం గ్రామ కార్యదర్శి కప్పల రత్నరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధాంతం శ్మశాన వాటిక డంపింగ్ యార్డుగా మారిందన్నారు. పందులు, కుక్కలకు నిలయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అంత్యక్రియలకు జరిగే సమయంలో కనీసం నిలుచోవడానికి సైతం చోటు లేకుండా అపరిశుభ్రంగా ఉందన్నారు. శ్మశానం అంతా పిచ్చిమొక్కలు మొలిచి చిట్టడవిలా ఉందన్నారు. దీంతో అఖరి మజిలీకి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆలయ ఆస్తులు, ఇసుక రేవు టోల్‌గేట్ ద్వారా వచ్చిన ఆదాయం లక్షలాది రూపాయలు ఉన్నా అభివృద్ధి చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. త్వరగా అభివృద్ధి చర్యలు చేపట్టకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆకుల వీర్రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వేదికకు వర్షం అడ్డంకి


పెనుగొండ ప్రజావేదికలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: ప్రభుత్వం 100 రోజుల పాలనను వివరించడానికి ప్రారంభించిన ప్రజా వేదిక ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వర్షం అడ్డంకిగా మారింది. ఆచంట నియోజవర్గంలో పెనుగొండ పంచాయతీ వద్ద ప్రజా వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కరపత్రాలు ఆవిష్కరించి ప్రారంభించారు. వినతులు స్వీకరిస్తుండగానే వర్షం ప్రారంభం కావడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా పంచాయతీ వద్ద మొక్కలు నాటి, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సీ మల్లుల లక్ష్మీ నారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కాశ్యామలాసోనీ శాస్త్రి, ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలకవర్గ సెక్రటరీ కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు పాల్గొన్నారు.

పెనుగొండ అభివృద్ధికి కృషి

పెనుగొండ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ పంచాయతీ సర్వసభ్య సాధారణ సమావేశం సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనిత కుమారి, ఎంపీడీఓ సున్నం శ్రీనివాస దొర, కార్యదర్శి టిరత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఆక్రమణదారులకు నోటీసులు


ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ బ్రాడీపేట బైపాస్‌రోడ్డులో ఆక్రమణ దారులకు శుక్రవారం పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా రెండు రోజుల్లో ఆక్రమణలన్నీ తొలగించాలని ఆదేశించారు. లేని పక్షంలో ప్రొక్లెయినర్‌తో ఆక్రమణలు తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. ఈఓపీఆర్డీ కేఎం వైభవతి, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు (చిన్నా), వీఆర్వో లక్ష్మి ఆక్రమణదారులకు నోటీసులు అందజేశారు.

సబ్బేవారిపేటలో పోషకాహార అవగాహన ర్యాలీ


సబ్బేవారిపేటలో పోషకాహార అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని సబ్బేవారిపేటలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి సూచించారు. దీని వల్ల రక్తహీనత సమస్యలు తగ్గుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఒడూరి పద్మ, ఎల్.విజయకుమారి, కె.దుర్గ, డి.ప్రసన్న, ఎ.పల్లవి పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని నాలుగు నిరుపేద కుటుంబాలకు గడచిన నాలుగేళ్లుగా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రతి నెల నెలకు సరిపడ నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మాదిరిగానే ఈ నెల సరుకులు సంస్థ ప్రతినిధి ముద్దల రాధాకృష్ణ శుక్రవారం అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈఈ దుర్గేష్

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రతిపాదించిన వివిధ ఆధునీకీకరణ, అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించే క్రమంలో శుక్రవారం దేవదాయ ధర్మదాయ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గేష్ కుమార్ (కాకినాడ) శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయాన్ని పరిశీలించారు. అమ్మవారి దేవస్థానానికి సంబంధించిన పార్కింగ్, లడ్డూ ప్రసాదాలు తయారీ కేంద్రం,శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి, దేవస్థానం నూతన పెయింటింగ్ తదితర పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయమై సమగ్ర పరిశీలన అనంతరం ప్లాన్‌లు తయారు చేయిస్తామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ, శ్రీ సుబ్బారాయుడు దేవస్థానం కార్యనిర్వాహణాధి కారి డి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి కాకినాడకు చెందిన కె.సత్య శ్రీనివాసరెడ్డి 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని బాలుడికి గాయాలు

ఉండి: మండలంలోని ఉప్పులూరులో ద్విచక్ర వాహనం ఢీకొని తొమ్మిదేళ్ల బాలుడు గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరులో కొత్త చర్చి వద్ద శుక్రవారం కొల్లి రక్షణబాబు (9)ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బాలుడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాలుడిని భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు బాలుడి తండ్రి నానిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎండీ నసీరుల్లా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: హైదరాబాద్ స్టార్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ నెల 22న మల్టీస్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి డీజీఎం కె.సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జువ్వల పాలెం రోడ్డులోని ఆనంద్ ఫంక్షన్‌హాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.